నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల ఏడో తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, వాటి స్థితికి సంబంధించిన సమాచారం గురించి తెలుసుకోవడానికి 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీడికి 'జాతీయ' గుర్తింపు

రైతుల రేయింబవళ్ల కష్టం, అధికార యంత్రాంగం కృషి, పటిష్ట ప్రణాళికల ఫలితంగా వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) కార్యక్రమంలో భాగంగా సిక్కోలు జీడిపప్పుకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించిన విషయం విదితమే. ఈనెల 14న ఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నారు. మన జీడిపప్పుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినా... కష్టనష్టాలు, వ్యయప్రయాసలకోర్చి దాన్ని పండిస్తున్న రైతులకు మాత్రం గుర్తింపు లేకుండా పోయింది. దళారుల దగా, ప్రభుత్వ ఉదాసీన వైఖరి వెరసి వారికి గిట్టుబాటు ధర లేక వ్యథే మిగులుతోంది.

- నేడు అవార్డు అందుకోనున్న కలెక్టర్
- జీడి పంటకు మాత్రం కానరాని గిట్టుబాటు ధర

ప్రజాశక్తి - పలాస

జిల్లాలో జీడి పంట అనేకమందికి ప్రధాన జీవనాధారంగా ఉంది. జిల్లాలో మొత్తం 60 వేల ఎకరాల్లో జీడిమామిడి సాగవుతోంది. ఇందులో 55 వేల ఎకరాల్లో తోటలు దిగుబడినిస్తున్నాయి. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట వంటి ఉద్దాన ప్రాంత మండలాల్లో జీడిమామిడి విస్తారంగా సాగవుతోంది. మేలైన సంకర జాతి రకాలైన బిపిపి-8, 6, వి-4 వంటి అధిక దిగుబడి నిచ్చే రకాలు, స్థానిక వంశపారంపర్య జాతులు ఇక్కడ సాగులో ఉన్నాయి. ఈ పంట ద్వారా జిల్లాలో 1.05 లక్షల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం పొందుతున్నాయి. వీరిలో 31 వేల మంది సన్నకారు రైతులు, 56 వేల మంది చిన్న రైతులు, 18 వేల మంది పెద్ద రైతులు ఉన్నారు.

తిత్లీ నష్టం నుంచి తిరిగి పుంజుకుని...

2018 అక్టోబరులో వచ్చిన తిత్లీ తుపాను ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. ఈ విపత్తు తర్వాత ఉద్యాన శాఖ విస్తృత పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టింది. సుమారు 23 వేల ఎకరాల్లో పాత తోటలను పునరుద్ధరించడం, 7,500 ఎకరాల్లో అధిక దిగుబడినిచ్చే కొత్త జీడి తోటలను ఏర్పాటు చేయడం, ఉపాధి హామీ ద్వారా మరో 7,500 ఎకరాల్లో సాగు విస్తరణ చేయడం వంటి చర్యలు చేపట్టారు.

తిరుపతి లడ్డూలో పలాస జీడిపప్పు

తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు ప్రసాదం తయారీలో పలాస జీడిపప్పును వినియోగించడం, ఇక్కడి జీడిపప్పుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఒక కారణమైంది. పలాస నుంచి ప్రతిరోజూ సుమారు మూడు వేల కేజీల జీడిపప్పును టిటిడిలో పలు ప్రసాదాల తయారీకి పంపిస్తున్నారు.

జాతీయస్థాయి పరిచయం

సాగుతో పాటు ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనపైనా ఉద్యాన శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఎంఐడిహెచ్, ఆర్‌కెవివి ద్వారా ఇప్పటివరకు 25 జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లను ఆధునీకరించి, సబ్సిడీ మంజూరు చేసింది. ప్రస్తుతం మరో తొమ్మిది యూనిట్లకు నిధుల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. ఎంఎస్ఎంఇ డే, కాష్యూ ఎక్స్‌పో (పలాస) వంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలోని రైతులు, వ్యాపారులు, ప్రాసెసర్లు తమ ఉత్పత్తులను దేశవాళీ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసుకున్నారు. ఇది వారి మార్కెట్ అవకాశాలను పెంచడంలో కీలకపాత్ర పోషించింది. ఆధునిక ప్యాకింగ్, శుభ్రతా ప్రమాణాలు, ఎగుమతి సౌలభ్యాలు కలిగిన ప్రాసెసింగ్ సెంటర్లు కూడా నిర్మించబడ్డాయి. సాధారణ జీడిపప్పుతో పాటు పుదీనా, చిల్లీ, పెప్పర్ వంటి సుగంధద్రవ్యాలు కలిపిన జీడిపప్పు, కాష్యూ బర్ఫీ, పలు స్వీట్లు, చిక్కీలు, ఇతర చిరుతిళ్ల తయారు చేసే పరిశ్రమలు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రాచుర్యం పొందాయి. ఉద్యాన శాఖ ద్వారా ఒడిఒపి ప్రాథమిక నివేదికను చేనేత, జౌళి శాఖ సహకారంతో గతేడాది అక్టోబరులో సమర్పించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం నుంచి అధికార బృందం పలాస ప్రాంతంలో జీడితోటలు, ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించింది.

రైతులకు కానరాని గిట్టుబాటు ధర

జీడిపప్పుకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించినా, కష్టనష్టాలకోర్చి దాన్ని పండిస్తున్న రైతులకు మాత్రం గిట్టుబాటు ధర కానరావడం లేదు. ప్రభుత్వం జీడిపప్పు ఉత్పత్తిదారులకు అనేక రాయితీలు ఇస్తున్నా, దాన్ని పండిస్తున్న రైతులు, జీడి కార్మికులను మాత్రం విస్మరిస్తోంది. ఉద్దానం మండలాలైన వజ్రపుకొత్తూరు, మందస, పలాస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో రైతులు జీడి సాగు చేస్తున్నారు. 16 వేల మెట్రిక్ టన్నుల దిగుబడులు సాధిస్తున్నారు. వీటి ఆధారంగా 400కు పైగా పరిశ్రమలు నడుస్తుండగా, ఏటా సుమారు రూ.10 వేల కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ పంటను పండిస్తున్న రైతులకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మద్దతు ధరల జాబితాలో జీడిపంటను చేర్చాలి

జీడిపప్పుకు జాతీయ అవార్డు రావడం వెనుక జీడి రైతులు, కార్మికుల శ్రమ ఉంది. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరల జాబితాలో జీడిపంటను చేర్పించి రైతులకు బాసటగా నిలవాలి. జీడి మద్దతు ధర కోసం కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నాం. గత ఎన్నికల్లో జీడికి మద్దతు ధర, జీడి కార్పొరేషన్, పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి. రైతులకు ప్రోత్సాహం అందిస్తే దిగుబడులు మరింత పెరుగుతాయి.

- తెప్పల అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్, జీడిరైతు సంఘం

జిల్లాకు అరుదైన గౌరవం

జిల్లాకు అరుదైన గౌరవం లభించింది. జీడిపప్పుకు జాతీయ అవార్డుతో రైతాంగానికి, జీడి కార్మికులు, యాజమాన్యాలకు గుర్తింపు వచ్చినట్లయింది. జీడి సాగు మరిత పెరగడానికి ఇది దోహదపడే అవకాశముంది.

- మల్లా శ్రీనివాసరావు, అధ్యక్షులు, జీడి ఉత్పత్తిదారుల సంఘం, పలాస

సత్ఫలితాలనిచ్చిన చర్యలు

జీడిపంటను ఆధునిక పద్ధతుల్లో సాగు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగించుకునేలా ఉద్యానశాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. కలెక్టర్ సూచనలు, ప్రణాళిక, అభివృద్ధికి ఇచ్చిన ప్రోత్సాహ ఫలితంగానే ఈ అవార్డు లభించింది.

- రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన వితంతు పింఛన్లను మంజూరు చేయాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. నందిగాం మండలం కొత్త అగ్రహారం పంచాయతీకి చెందిన సుమారు వంద మంది రైతులు తమ భూమిని గత ప్రభుత్వం భూ సర్వే చేసిన తర్వాత అడంగల్, 1బి రావడం లేదని తెలిపారు. దీనిపై స్పందించి మంత్రి టెక్కలి ఆర్‌డిఒతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యని పరిష్కరించాలని ఆదేశించారు. నందిగాం మండలం దిమ్మిడిజోలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద అనారోగ్యాల కారణంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 13 మంది బాధితులకు రూ.26.19 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపి బర్రె రామకృష్ణ, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నారాయణవలస సంతకు పూర్వవైభవం తీసుకొస్తా

నారాయణవలస సంతకు పూర్వపు వైభవం తీసుకొస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నారాయణవలస సంత పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఈ సంతలో ఎలాంటి పనులు చేయకుండా సర్పంచ్ రూ.1.50 కోట్లు నొక్కేసినట్లు విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. మింగిన ప్రతి రూపాయి కక్కిస్తానన్నారు. రూ.600 కోట్లతో హిరమండలం రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తెచ్చి నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీ రందిస్తామని తెలిపారు. నిమ్మాడ జంక్షన్ నుంచి తిలారు మీదుగా నారాయణవలస వరకు సిసి రోడులకు నిధులు మంజూరయ్యాయని, వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తానన్నారు. నారాయణవలసలో బస్ షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టి.రామకృష్ణ, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ పోరుకు 15 ఏళ్లు

నేడు బీలలో అమరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి- సోంపేట

పచ్చని పంట పొలాల్లో థర్మల్ కుంపట్లు పెట్టవద్దంటూ నినదించిన స్థానిక ప్రజలపై అప్పటి ప్రభుత్వం దమనకాండ సాగించి ముగ్గురు అమాయక రైతులను పొట్టన పెట్టుకుంది. థర్మల్ పోరాటం ఉధృతమై దేశంలో ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచి సోమవారానికి 15 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో బీలలోని అమర వీరుల స్మారక స్తూపం వద్ద వారికి ఘన నివాళ్లర్పించడానికి థర్మల్ పోరాటంలో పాల్గొన్న ప్రజలంతా మరోసారి సిద్ధమవుతున్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి, తీర ప్రాంత మత్స్యకార ఐక్యవేదిక సంయుక్తంగా ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అమరవీరుల స్తూపం

నెత్తుటి గాయం

పర్యావరణాన్ని కాపాడుకునేందుకు, రాజ్యాంగం కల్పించిన తమ హక్కులను సంరక్షించుకునేందుకు ప్రభుత్వానికి, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా స్థానిక రైతులు, ప్రజలు ఏకమై సాగించిన థర్మల్ విద్యుత్ వ్యతిరేక పోరాటంలో ముగ్గురు రైతులు పోలీసు తూటాలకు బలైన నెత్తుటి మరక ఇప్పటికీ మానని గాయంగానే ఉంది. థర్మల్ పోరాటంలో పాల్గొన్న అనేకమంది కార్మిక, కర్షక, మత్స్యకార, రైతు కుటుంబాలకు చెందిన వారిపై నమోదు చేసిన కేసులు ఇప్పటికీ కోర్టుల నడుస్తూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు ఇచ్చిన ఘనత సోంపేట థర్మల్ పోరాటానిది. అటువంటి పోరాటంలో అసువులు బాసిన అమరుల స్మరించుకునేందుకు మరోసారి బీల ప్రాంతం సిద్ధమైంది. థర్మల్ పోరాటం ముగిసినా పూర్తిస్థాయిలో పేలన సామానుచుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇంకా ఆ దిశగా పోరాటం చేస్తూనే ఉన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతున్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, గొడవలు, నేరాలకు దూరంగా ఉండాలని రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారికి, పాత నేరస్తులకు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడ అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానితుల కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచుతోందని తెలిపారు.

15న ఎస్‌టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావు ఈనెల 15వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆయన అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి ఆలయంలో దర్శనం చేసుకుంటారని, అనంతరం శాంతినగర్‌లోని ఎపిటిడబ్ల్యుఎ పాఠశాలను సందర్శించి గిరిజన విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అక్కడ్నుంచి మందస తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆదివాసీ ప్రజలు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4.45 గంటలకు ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి వెళ్లి, అన్ని కోర్సుల్లో రిజర్వేషన్ల అమలు, ఆదివాసీ విద్యార్థుల సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు. రాత్రి విజయనగరం క్యాంపు కార్యాలయానికి తిరిగి బయలుదేరుతారని తెలిపారు.

శివారు భూములకు నీరు

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

నియోజకవర్గంలోని శివారు భూములకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని పెద్దదూగం దగ్గర వంశధార కాలువ 24 ఎన్‌బిసి బ్రాంచ్ కెనాల్ ఎడమ కాలువ వద్ద సాగునీటిని ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో 37,700 ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. 2019-24లో వంశధార ఎడమ కాలువ ఆధునికీకరణకు రూ.860 కోట్లు నిధులు మంజూరు చేశామని తెలిపారు. అయితే తరువాత వచ్చే వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడుల సహకారంతో రూ.1200 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే శాసనసభలో తాను ప్రస్తావిస్తానని గుర్తు చేశారు. అలాగే రైతుల కూడా సహకరించి చిన్నచిన్న పనులూ చేయగలిగితే శివారు భూములకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, కింజరాపు సత్యనారాయణ, జలుమూరు టిడిపి మండల అధ్యక్షులు వెలమల రాజేంద్ర, జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, గుండ మన్మథరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, పిరియా వెంకట్రావు, జుత్తు అప్పలనాయుడు, వంశధార ఇఇ మురళీమోహన్, డిఇలు శిమ్మ శ్రీనివాసరావు, రామలక్ష్మి, ఎఇలు హరీష్, శ్యామలరావు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

వంశధార కాలువలకు మహర్దశ

రూ.85 లక్షలతో పూడికలతీత

ప్రజాశక్తి- పలాస

వంశధార కాలువలకు ఎట్టకేలకు మహర్దశ పట్టింది. ఎన్నో ఏళ్లుగా పూడికలు తీయకపోవడంతో శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి. ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి వంశధార నీటిని శివారు భూములకు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది పూడికలు తీత పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో పలాస, కాశీబుగ్గ వంశధార సబ్ డివిజన్లు ఉన్నాయి. వంశధార ప్రాజెక్టు పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలం కణితూరు నుంచి కొంత భాగం కలుపుకుని సుమారు 23 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వ హయాంలో వంశధార శివారు భూములకు సాగునీరు సరఫరా చేయకపోగా, పూడిక తీతపనులు చేపట్టక పోవడంతో కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. అప్పటి పాలకులు అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పలాస, కాశీబుగ్గ వంశధార ప్రాజెక్టు సబ్ డివిజన్ పరిధిలో నందిగాం మండలం కణితూరు నుంచి టెక్కలి పట్నం, కేసుపురం, ఈదురాపల్లి, శాసనాం, జగన్నాథసాగరం వరకు వంశధార మెయిన్ కెనాల్‌లో పూడిక తీత పనులు చేపట్టారు. బ్రాహ్మణతర్ల, అమలకుడియా, కేసుపురం, మొగిలిగెడ్డ, కంబిరిగాం, గరుడఖండి గెడ్డలో సుమారు 20 ఏళ్ల నుంచి పూడికతీత పనులు చేపట్టలేదు. ఈ ఏడాది ముందుగా గెడ్డ ప్రాంతాల్లో పనులు చేపట్టారు. గత ఏడాది సుమారు రూ.10 లక్షల వ్యయంతో శివారు భూములకు సాగునీరు అందించేందుకు ఖర్చు చేశారు. ఈ ఏడాది పలాసలో 24, వజ్రపుకొత్తూరులో 10 వంశధార కాలువ పనులకు రూ.85 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు. వంశధార కాలువ పనులు చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే నీరు శివారు భూములకు సరఫరా కాగా, ఈ ఏడాదీ ముందుగా వంశధార నీటితో చెరువులు గెడ్డలు, వాగులు నిండు కుండలా దర్శనమిస్తున్నాయి.

ఈ విషయంపై వంశధార ఇఇ శేఖర్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు రూ.85 లక్షలతో పూడిక తీత పనులు చేపట్టామని చెప్పారు. ఈ ఏడాది వంశధార నీటిని శివారు భూములకు త్వరగా చేరుకుంటుందని, కాలువ పనులు చాలా చక్కగా చేపట్టామని అన్నారు. పనులు పూర్తి చేసిన అనంతరం బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

కాలువలో తొలగించిన పూడికలు

నైపుణ్యం ఉంటేనే ఉపాధి

- ప్రారంభంలో తక్కువ వేతనమైనా ఉద్యోగంలో చేరాలి
- అనుభవంతో మంచి భవిష్యత్
- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రస్తుతం నిరుద్యోగ యువత గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ అన్నారు. నైపుణ్యాలు ఉంటే ఉద్యోగాలకు కొదవ ఉండదని అన్నారు. నైపుణ్య కల్పనకు ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కృషి చేస్తుందని తెలిపారు. యువతలో నైపుణ్యాల కల్పన లక్ష్యంగా జిల్లా నైపుణాభివృద్ధి కృషి చేస్తుందని చెప్పారు. ఉన్నత, సాంకేతిక విద్యతోపాటు నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు లేకపోతే ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎంపిక సాధ్యం కాదని చెప్పారు. నైపుణాభివృద్ధి కేంద్రాల్లో సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? నైపుణ్యాలకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

యువతలో నైపుణ్యాల కల్పనకు ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కృషి చేస్తుంది. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు) నిర్వహిస్తున్నాం. కోర్సు బట్టి కనీసం మూడు నెలల శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్ చూపిస్తున్నాం. కంపెనీలు నేరుగా వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించి ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ ఐటిఐల్లో సైతం స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం.

? ఎంతమందికి ప్లేస్‌మెంట్ ఇచ్చారు?

గతేడాది ఏప్రిల్ నుంచి జూన్ 30 వరకు 8 నియోజకవర్గాల్లో మూడు వేల మంది వరకు శిక్షణ ఇచ్చాం. 2,500 మందికి ప్లేస్‌మెంట్లు ఇచ్చాం. నైపుణ్య శిక్షణ తీసుకున్నవారు 90 శాతం ఉద్యోగాలకు వెళ్తున్నారు. మరికొందరు వెళ్లడానికి ఇష్టపడటం లేదు. శిక్షణ పూర్తి చేసిన తరువాత ఉద్యోగాలకు వెళ్లేందుకు ముందుకు రావాలి. మెరుగైన భవిష్యత్‌కు పని చేసేందుకు మందుకు రావాలి.

? ఎటువంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు?

విద్యార్హత బట్టి శిక్షణ ఇస్తున్నాం. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హత బట్టి పురుషులకు ఎలక్ట్రీషన్, ప్లంబర్, సిసి కెమెరా ఇనిస్టిలేషన్, వెల్డర్ వంటి అంశాల్లో ఇస్తున్నాం. మహిళలకు బ్యూటీషియన్, ఫ్యాషన్ టెక్నాలజీ, టైలరింగ్ ఒంటి అంశాల్లో ఇస్తున్నాం. డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి విద్యార్థులకు ఫార్మా, సాఫ్ట్‌వేర్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. అధునాతన సాఫ్ట్‌వేర్‌లు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

? ఏ రంగంలో ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి?

డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి పూర్తి కోర్సులు పూర్తిచేసిన వారికి ఐటి, ఫార్మా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఈ ఉద్యోగాలకు యువత ఆసక్తి చూపిస్తున్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమా వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి అన్ని రకాల పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. 20 ఏళ్ల లోపు వీరి ఉద్యోగాలు సాధిస్తున్నారు. జాబ్‌మేళాల ద్వారా స్థానికంగా కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే స్కిల్డ్ వర్కర్సుకు ఎక్కువగా డిమాండ్ ఉంది.

? ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి?

ప్రస్తుతం పరిశ్రమలే ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తున్నాయి. ఎంపిక కావాలంటే నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్ వంటి అవసరం. ఈ అంశాలపై స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నాం. పారిశ్రామిక అవసరాలను అనువైన శిక్షణ వల్ల మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

? స్థానికంగా ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి?

ఉద్యోగాలు ఎక్కడ వచ్చినా పనిచేసేందుకు యువత సిద్ధంగా ఉండాలి. కంపెనీలో రెండేళ్లు పనిచేస్తే పూర్తిస్థాయి అనుభవం వస్తుంది. మెరుగైన వేతనం కోసం కంపెనీలు మారవచ్చు. కొంతమంది యువత బయట ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాల్లో ఉండలేకపోతున్నారు. ఇది వారి ప్రగతికి అవరోధంగా మారుతుంది.

? ఉద్యోగాలకు ఎందుకు ఆసక్తి చూపటం లేదు?

ప్రారంభంలో మెరుగైన వేతనాలు, ప్యాకేజీలు అందరికీ లభించవు. ఉద్యోగంలో చేరాక నైపుణ్యాల ఆధారంగా మంచి భవిష్యత్ ఉంటుంది. ఓర్పుతో పనిచేయడం తప్పనిసరి. పోటీ పరీక్షలకు తీవ్రంగా శ్రమించి ఉద్యోగాలు సాధించలేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. 35 ఏళ్లు దాటాక ఉద్యోగ సాధన కష్టం. తక్కువ వయసులో ఉద్యోగంలో చేరి శ్రమిస్తే మంచి భవిష్యత్ ఉంటుంది. యువతలో అనుకూల దృక్పథం అవసరం ఉంది.

మాట్లాడుతున్న ఇఇ యజ్ఞేశ్వరరావు

పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి- పలాస
కాశీబుగ్గ ఇండస్ట్రీ ఏరియాలో ఉన్న జీడి పరిశ్రమలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు వ్యాపారులకు హామీ ఇచ్చారు. కాశీబుగ్గ ఇండస్ట్రీ ఏరియాలో జీడి వ్యాపారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరా ఎప్పటికప్పుడు నిలిచిపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనివార్య కారణాల వల్ల విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఎడిఇ సత్యనారాయణ, ఇండస్ట్రీ జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, తూముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

సిసి కాలువ పనులు పరిశీలన

పలాస: కాశీబుగ్గ పాత జాతీయ రహదారి నుంచి శనీశ్వరస్వామి ఆలయం వరకు రూ.16 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సిసి కాలువ పనులను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదివారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, పనులు చేపట్టే సమయంలో నాణ్యత లేదని ప్రజలు నుంచి ఫిర్యాదులు వస్తే బిల్లులు చెల్లించడం కుదరదని కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. పనులు చేపట్టే సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయనతో కౌన్సిలర్లు సోమే శ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, కాంట్రాక్టర్ మూల కృష్ణారావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

హేమంతలక్ష్మి, వైద్యాధికారి

మెళియాపుట్టి: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు దండయాత్ర చేయడానికి పొంచి ఉన్నాయని, వాటిలో డెంగీ జ్వరం ఒకటి అని చాపర పిహెచ్‌సి వైద్యాధికారి హేమంత లక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దోమ కాటుతో సంక్రమించే ఈ వ్యాధిని పరిశుభ్రత అనే ఆయుధంతోనే తరిమికొట్టాలన్నారు. ఏటా జూలై నుంచి సెప్టెంబరు నెలల్లో డెంగీ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని చెప్పారు. వాతావరణం తేమగా ఉంటే వీటి సంఖ్య మరింతగా పెరుగుతాయని పేర్కొన్నారు. డెంగీ లక్షణాలు హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, చర్మంపై దద్దుర్లు, కనుగుడ్లు కదపలేనంతగా నొప్పి, ఒక్కొక్కసారి ఒంట్లో రక్తస్రావం జరిగి ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అందుకు పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జ్వరం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

క్రీడాకారుల ప్రతిభ

కవిటి: జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీల్లో కవిటికి చెందిన బెందాళం సమన్విత సత్తా చాటింది. అండర్-11 విభాగంలో నిర్వహించిన సింగిల్స్ పోటీలో సమన్విత రెండో స్థానాన్ని సాధించింది. మరోవైపు కవిటి మండలానికే చెందిన బల్లెడ రూపిణితో కలిసి సమన్విత ఆకర్షణీయ ప్రదర్శనతో డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి విజేతలుగా నిలిచారు. దీంతో త్వరలో కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సమన్విత - రూపిణీ జంట జిల్లా తరపున ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉషోదయ యువజన సంఘం, ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్, గ్రామ పెద్దలు, క్రీడాభిమానులు విజేతలను అభినందించారు.

బాధిత మహిళకు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సోంపేట: మండలంలోని కొర్లాంకు చెందిన రాంబుడ్డి భాగ్యలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సంతోషిమాత యువజన సేవా సంఘం సభ్యులు ఆదివారం ఆమెకు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ దుంపల వైకుంఠరావు, సంఘ సభ్యులు ఆర్.గంగారావు, చందు, యాదగిరి, హరికృష్ణ, ఈశ్వరరావు, తిరుపతి, ప్రవీణ్, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

షీల్డ్ బహుకరిస్తున్న సంఘ సభ్యులు

ప్రతిభకు ప్రోత్సాహం

కవిటి: 20 కిలోమీటర్ల నడక పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించిన మొగిలిపురి సతీష్ ప్రతిభను ప్రోత్సహిస్తూ సొండి సంక్షేమ సంఘం ఆదివారం ఆత్మీయ సత్కారం చేసింది. సతీష్ ప్రతిభను గుర్తిస్తూ అతని తండ్రి మొగిలిపురి శ్యాంసుందర్‌కు షీల్డ్, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, యువకులకు సొండి సంక్షేమ సంఘం ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేసింది. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

రణస్థలం: డిఎస్‌సి -2003 ద్వారా నియమించబడిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకాన్ని త్వరగా అమలు చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు ఆదివారం ఇంటివద్దే ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వ మెమో నెం. 57 డిఎస్‌సి -2003 ద్వారా ఎంపిక చేయబడిన ఉపాధ్యాయుల నియామకాలు 2004కి ముందు ఖాళీలను భర్తీ చేయడానికి ఉద్దేశించినప్పటికీ, విధానపరమైన, పరిపాలన పరమైన జాప్యాలు అధికారిక ప్రవేశానికి దారితీశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ, ఈ అర్హత కలిగిన ఉపాధ్యాయుల కోసం పాత పెన్షన్ పథకాన్ని ఇంకా అమలు చేయలేదని, దీనివలన బోధనా సమాజంలో తీవ్ర ఆగ్రహం, మానసిక క్షోభ, అన్యాయ భావన ఏర్పడిందన్నారు. అర్హత కలిగిన వారందరికి పాత పెన్షన్ పథకానికి ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 18న ఉమ్మడి జిల్లా కేంద్రాలలోని కలెక్టరేట్ల వద్ద శాంతియుత నిరసన తెలియజేయడానికి పెద్దస్థాయిలో కుటుంబ సమేతంగా అందరూ హాజరు కావాలని ఉపాధ్యాయ ప్రతినిధులు బి.చిన్నంనాయుడు, జి.చిన్నికృష్ణ పిలుపునిచ్చారు.

కూటమి పాలన మోసాలమయం

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- లావేరు
కూటమి ప్రభుత్వ పాలన పెద్ద మోసాలమయమని, సిఎం చంద్రబాబు నాయుడు అబద్ధాల పుట్టని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం లావేరు మండల వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో బాబూ ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం బెజ్జుపురంలో వైసిపి మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణదాస్ మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ ప్రజలకు మేలు చేసారని, సోనియాగాంధీ, ఎల్లోమీడియాను దీటుగా ఎదుర్కొని 151 స్థానాలు గెలిచి ఈ స్థాయికి వచ్చారన్నారు. పాలనలో ఎటువంటి పొరపాట్లుకు పార్టీవైపు నుంచి తావివ్వకుండా ఉండడంతోనే కార్యకర్తలతో జగన్‌కు కొంత గ్యాప్ రావడం నిజమన్నారు. రాబోయేది వైసిపికి అనుకూలమైన రోజులేనని, కార్యకర్తలంతా ఐక్యంగా కష్టపడి పని చేయాలన్నారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి పాలన రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకంతో నడుస్తోందని మండి పడ్డారు. చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. సినిమా వ్యామోహంలో యువత ఆకర్షతులయ్యారని, జగన్మోహన్‌రెడ్డి చేసిన మేలు, మంచి పనులను మర్చిపోయారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకానికి రానున్న జగనన్న ప్రభుత్వంలో వడ్డీతో సహా అసలుతో లెక్క కట్టి ధీటుగా బదులు ఇస్తామన్నారు. సమావేశంలో ఎంపిపి అమ్మాజమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, బి.జనార్దన్ రెడ్డి, హేమామాలిని, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలనతోనే ప్రగతి సాధ్యం

తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస
సుపరిపాలనతోనే ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కలివరం పంచాయతీ పీరు సాహెబ్ పేటలో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు తాడి చంద్రశేఖర్ యాదవ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు తమ్మినేని నాని, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ గొండు రమణ తదితరులు పాల్గొన్నారు.
పలాస : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. కాశీబుగ్గ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, కాశీబుగ్గ క్లస్టర్ కన్వీనర్ సవర రాంబాబు, కో-కన్వీనర్ కొత్త సత్యం, పలాస ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.
మెళియాపుట్టి : మండలంలోని మారడికోటలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అగ్గాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.
ఇచ్ఛాపురం : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు ప్రజలకు తెలుపుతూ 16 వార్డు ఇన్‌ఛార్జి నాగరాజ్ పాత్రో ఇంటింటా సర్వే చేపట్టారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ గౌడో రవికుమార్, వార్డు కమిటీ చైర్మన్ కోళ్ల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఐటిఐ కౌన్సెలింగ్ వాయిదా

రామ్మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ
శ్రీకాకుళం డిఎల్‌టిసి ఐటిఐలో రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 23వ తేదీకి కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు ఎడి రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు స్వీకరణ సైతం ఈనెల 20 వరకు కొనసాగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో iti.ap.gov.in సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మహిళలు ప్రత్యేకంగా సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్‌లైన్‌లో 250 దరఖాస్తులు చేసుకు న్నారన్నారు. మరిన్ని వివరాలకు 9505161701, 9963945259, 9885960809 నంబర్లు సంప్రదించాలన్నారు.

నేడు మండల సమావేశం

ఆమదాలవలస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపిపి తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రోణంకి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపక అతిథి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులను దాటి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని ఆమె కోరారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

శ్రీరాములు నాయుడును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎఎంసి చైర్మన్‌కు సత్కారం

బూర్జ: ఆమదాలవలస మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మజ్జి శ్రీరాములు నాయుడును ఆదివారం పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. టిడిపి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన శ్రీరాములు నాయుడుకు చేసిన సేవలే గుర్తింపునిచ్చాయని కొని యాడారు. ఈ సందర్భంగా పాలకొండ పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం టిడిపి నాయకులు గిరడ హరిబాబు, కోడి గోవిందరావు, సీపాన ధనుంజయ, గేదెల చిన్న మౌళి, శంకరరావు, వావిలపల్లి ప్రసాద్‌లు ఘనంగా సత్కరించారు.

పిఎసిఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

మురళిని సన్మానిస్తున్న నాయకులు

పొందూరు: పొందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) చైర్మన్‌గా నియమితులైన వండాన మురళీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మురళి, పర్సన్స్ కింజరాపు వెంకటరమణ, దుంపల సత్యంలతో పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి సిపాన శ్రీరంగనాయకులు, జిల్లా తెలుగుయువత కార్యదర్శి శంకర్ భాస్కరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బి.శేషగిరి, మండల తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక శిక్షణ

కవిటి: ప్రాథమిక దశలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శిక్షణ అందిస్తున్నట్లు కుసుంపురం మోడల్ ప్రైమరీ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శమల్ల రాజబాబు తెలిపారు. ఐదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు జగన్ ఆధ్వర్యాన రోజూ సాయంత్రం, సెలవు రోజుల్లో రెండు గంటల పాటు నవోదయ, క్విజ్ పోటీలకు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి డిజిటల్ క్లాసులతోపాటు మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. లక్షల్లో ఖర్చుపెట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారికి తీసుపోని విధంగా తమ విద్యార్థులను తయారు చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

తరగతులు చెప్పున్న ఉపాధ్యాయుడు జగన్

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

నానిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
మాజీ మంత్రి పేర్ని నాని శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, పోలీసులు నాని అరెస్టు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ బస్టాండ కూడలి వద్ద నాదాలు చేస్తూ... ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం ఎస్ఐ ముకుందరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల అవనిగడ్డలో వైసిపి కార్యకర్తలు సమావేశంలో నాని సమాజంలో అశాంతి చెలరేగేలా, శాంతిభద్రతకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దారుణమ అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రీ తవిటయ్య, నందిగాం కోటి, కృష్ణయ్య, లీలారాణి, కాళ్ల జయదేవ్, నందికి జాని, కొండ శంకర్‌రెడ్డి, ఆసి ధర్మా రాజురెడ్డి, జానకిరామ్, దట్టి శ్రీను, వెంకటరెడ్డి, శాసన శేఖర్, గన్ని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.
కవిటి: ప్రజల్లో వైషమ్యాలు కలిగిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి పేర్ని నానిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల నాయకులు కోరారు. ఈ మేరకు కవిటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, మణి చంద్రప్రకాష్, బెందాళం రమేష్, పండి దేవేంద్రమూర్తి, సీపాన వెంకటరమణ, బెందాళం తిరుమల కుమార్ పాల్గొన్నారు.

పూర్వపు గురువులతో పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- లావేరు
అలనాటి గురువుల గుణాత్మక విద్యాబోధనలతోనే తాము ఉన్నతస్థాయిలో రాణించామని శ్రీకాకుళం జిల్లా విశ్రాంత జెసి రెడ్డి గున్నయ్య అన్నారు. ఆదివారం లావేరు జెడ్‌పి పాఠశాలలో 1973 నుంచి 1980 వరకు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఇక్కడే చదివిన పూర్వ విద్యార్థుల కలయిక పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిల్లో ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఉన్నత స్థానాల్లో వున్నవారు కుటుంబాలతో సమావేశమై అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 50 ఏళ్ల తర్వాత ఒక్కదగ్గర కలిసి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విశ్రాంతి జెసి గున్నయ్య మాట్లాడుతూ ఆనాడు గురువులు, పెద్దలు, తల్లిదండ్రులపై గౌరవం, భయం, భక్తితో విద్యను అభ్యసించడంతో పలువురం ఉన్నత ఉద్యోగులుగా, వ్యాపార, వ్యవసాయరంగాల్లో రాణించామన్నారు. పూర్వపు అధ్యపకులు ఎం.నీలాద్రిరావు, సూర్య నారాయణ, ప్రకాశరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు మాకన మల్లీశ్వరరావు, మీసాల వెంకటరమణ, యినపకుర్తి రాంబాబు, కోరాడ వెంకటరమణ, బాసిన నాగేశ్వం రావు, మనేం మధు సూధనరావు, గోపాలరావు, చిక్కాల అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న కృష్ణచైతన్య

ప్రజాశక్తి- నరసన్నపేట
వైసిపి సోషల్ మీడియా బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షం గొంతు నొక్కెయ్యడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు హామీలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియానే వైసిపికి ఉన్న ఏకైక అస్త్రంగా భావించాలని అన్నారు. జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి బోర నర్సునాయుడు మాట్లాడుతూ సోషల్ మీడియా బలోపేతానికి అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అరంగి మురళీధర్, నియోజకవర్గ సోషల్ మీడియా అనుబంధ విభాగం అధ్యక్షులు పంగ వెంకటరమణ, వైసిపి విభాగం రాష్ట్ర కార్యదర్శి చింతు రాఘవరావు, బగ్గు రమణయ్య పాల్గొన్నారు.

ఆమదాలవలస : నివాళ్లర్పిస్తున్న కవి రాజారావు తదితరులు

'కోట' మృతికి సంతాపం

ప్రజాశక్తి- ఆమదాలవలస
ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ విలన్, కమెడియన్‌గా విభిన్న పాత్రలు పోషించి మెప్పించిన కోట శ్రీనివాసరావు మరణం సినీ పరిశ్రమకు, కళా రంగానికి తీరని లోటని పట్టణ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు కె.వి.రాజారావు, కార్యదర్శి మందపల్లి రామకృష్ణ సంతాపం తెలిపారు. ప్రతిఘటన, అహనా పెళ్లంట, శత్రువు తదితర ఎన్నో చిత్రాల్లో ఆయన నటన ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశారని సంతాప సభలో నివాళ్లు తెలిపారు.
టెక్కలి : తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొన్ని వందల చిత్రాల్లో విలక్షణ పాత్రలు పోషించి అనేక బహుభాషలో నటించిన నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని టెక్కలి సుదర్శన థియేటర్ యజమాని సత్తార్ వెంకటరమణ అన్నారు. ఆదివారం థియేటర్ ఆవరణలో శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. సినీ రంగంలో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ బాలకృష్ణ, వార్డు మెంబర్ బమ్మిడి గురువు నాయుడు, సర్పంచ్ సర్లన బాలకృష్ణ, తాతారావు, బోరిగి శ్రీనివాస్, వెంకటేష్, ఏజెంట్ జానీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవీంద్ర

ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ
ఎపి పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర అధక్షులు కె.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి 26 జిల్లాలకు చెందిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికార్లతో పాటు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సమాశంలో పలువురు సభ్యులు సమస్యలపై చర్చించారు. సైట్ ఇంజినీర్లుగా 2006 నుంచి ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 75 మంది ఉద్యోగులను, అలాగే టైమ్ స్కేల్ వర్కు ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న 36 మందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఇఇ, డిఇఇ, ఎఇ స్థాయి అధికారుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇఎన్‌సి కార్యాలయాల ముందు ధర్నా చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్‌లో ఉద్యమం చేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి కె.సిహెచ్ మహతి డిప్లొమా ఇంజినీర్లు సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ
నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం నిర్వహించారు. స్విమ్మింగ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.ఎస్.వి.ప్రసాద్‌తో పాటు నిపుణులు పర్యవేక్షణలో పారదర్శకంగా కీడాకారులు ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికల్లో ఐదుగురు బాలురు, ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. ఈనెల 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎస్‌డిఒ శ్రీధర్, ఎసిబిసిఐ భాస్కర్‌లు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అర్హత సాధించిన క్రీడాకారులను అభినందించి మాట్లాడుతూ విశాఖపట్నంలో జరగనున్న స్విమ్మింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులు, నేషనల్‌కు అర్హత సాధిస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులు, విజేతలుగా తిరిగివచ్చి విజయఢంకా మ్రోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజారత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, కోచ్ మురళీ, కోశాధికారి ఝాన్సీ, క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసన్న

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పొందూరు
ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఆదివారం అఫిషియల్ కాలనీలోని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్‌తో కలిసి మాట్లాడారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని పాఠశాలకు కొత్తగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, క్లస్టర్ ఉపాధ్యాయుల పోస్టులను సృష్టించి ఆ పోస్టుల్లో ఉపాధ్యాయులను భర్తీ చేశారని, అయితే నూతనంగా సృష్టించిన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడి నెంబర్లు ఇంతవరకూ కేటాయించక పోవడంతో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా చెల్లించాల్సిన ఇఎమ్‌ఐలు కట్టకపోవడంతో అధిక వడ్డీలు చెల్లించాల్సిన దుర్భర పరిస్థితి ఉపాధ్యాయ వర్గాలకు నెలకొందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొందూరు మండల డిటిఎఫ్ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- పొందూరు
స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఒకేషనల్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఇటి) గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఎఐసిటిఇచే గుర్తింపు పొందిన కళాశాల నుంచి 50 శాతం మార్కులతో బిటెక్ (ఇఇఇ) పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఈ నెల 15 సాయంత్రం 5 గంటలలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంపిక ప్రక్రియ నిమిత్తం నిర్వహించబోయే ఇంటర్వ్యూలకు, దరఖాస్తు సమర్పించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహా ఈనెల 18న ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో హాజరుకావాలని ఆమె తెలిపారు.
ఆమదాలవలస : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఅండ్ఎటి (మెకానికల్), ఎఅండ్‌టి (అకౌంట్స్) గ్రూపుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈనెల 15లోపు కళాశాల పనివేళల్లో సమర్పించాలని తెలిపారు.
కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో గెస్ట్ అధ్యాపకులతో తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గణపతి ధనంజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. డివిఇఒ ఆదేశాల మేరకు తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఆహ్వానిస్తున్నామన్నారు. జనరల్ కోర్సుల్లో హిస్టరీ/సివిక్స్ పోస్టు, వృత్తి విద్యా కోర్సు, ఆఫీస్ అసిస్టెంట్ షిప్ గ్రూపులో షార్ట్ హ్యాండ్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని అన్నారు. పిజిలో 50 శాతం మార్కులు, వృత్తి విద్యా పోస్టుకు ఎంకాం, షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్, లోవర్ గ్రేట్ ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 లోగా కళాశాల పనివేళల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని బాలురు కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.
ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ, ఎంపిహెచ్ గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.
సోంపేట : మండలంలోని బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.సౌజన్య కోరారు.